ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

మానవాళికి

TGTEL/25/A1132

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | మంగళవారం | 28.07.2026 | సంపుటి : 2 | సంచిక : 26 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు




## ఆ నియామకాలు చెల్లవ్..

విజయ్ సర్కార్‌కు హైకోర్టులో షాక్

ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు

కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పపై ఆక్షేపణ

02



## కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు

కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు

ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు

న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం

కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి

03

# నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం

శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు

" ఢిల్లీలో జరిగిన నిరసనల్లో విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడాన్ని సుప్రీం కోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగం ప్రకారం శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ప్రజలకు ఉంటుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఆందోళనలను కారణంగా చూసి వారిపై మితిమీరిన బలప్రయోగం చేయడం సరైన చర్య కాదని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుత నిరసనలు, పోలీసుల చర్యలపై ఏకరూప మార్గదర్శకాలు అవసరమని సీజేఐ అభిప్రాయపడ్డారు.



న్యూఢిల్లీ,జులై 27 : జులై 20న జరిగిన విద్యార్థుల ఆందోళనల వేళ పోలీసుల తీరును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. మ-రోవైపు ఆందోళనల్లో ఆకతాయిలు ప్రవేశించి పోలీసులపై దాడి చేయడంపై న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనల్లో చొరబడే విద్రోహ శక్తులపై చర్యలు తీసుకునేందుకు అధికారులకు పూర్తి అధికారాలు ఉండాలని పేర్కొన్నారు. ఆందోళనల సమయంలో పోలీసు సిబ్బందిపైనా దాడులు జరిగాయని ఓ న్యాయవాది తెలియజేయడంతో న్యాయమూర్తి ఈ విధంగా స్పందించారు. ప్రతి ఒక్కరి ప్రాణం ముఖ్యమైనదేనని అన్నారు. హింసకు తావు లేకుండా నిరసనకారులు స్వీయ క్రమశిక్షణ పాటించాలని సూచించారు. కాగా.. ఈ పిటిషన్లపై విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఆందోళనకారులపై పోలీసుల చర్యలపై స్వతంత్ర దర్యాప్తు

-మిగతా 2 లో..



# లోక్‌సభ వాయిదా

యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై మంగళవారం చర్చ

మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు

గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు

విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా

విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ మంగళవారానికి వాయిదా పడింది. పేపర్ లీకులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వచ్చినా.. బిల్లుపై చర్చించడం సాధ్యం కాలేదు. ఓ వైపు విపక్షాల ఆందోళనలు కొనసాగుతుండగానే.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఉదయం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన వెంటనే.. ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు. దీంతో మరోసారి స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 5 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా చర్చ చేపట్టకుండా విపక్షాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో సభను నేటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

న్యూఢిల్లీ, జూలై 27 : పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీ ఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో

-మిగతా 2 లో..

# హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి రంగనాథ్‌ను తప్పించండి

పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం

లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ

కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్

హైకోర్టు కీలక ఆదేశం



హైదరాబాద్, జూలై 27 : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు

-మిగతా 2 లో..

### వాళ్లకు అడ్డుపడటమే నేను చేసిన తప్పు



హైడ్రా కమిషనర్ రంగనాథ్

02



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కేసీఆర్ పరామర్శ

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సీఎం

హైదరాబాద్, జూలై 27 : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు

-మిగతా 2 లో..



# రాష్ట్రంలో ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం

విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం

అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి

**ఖమ్మం, జూలై 27 :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹86

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

న్యూఢిల్లీ, జూలై 27 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

-మిగతా 2 లో..





# ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం

యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్

02

# క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తం అవసరం

వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స తీసుకోండి

ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తోంది

నాపా ప్రతినిధుల అవేర్‌నెస్ కార్యక్రమం అభినందనీయం

వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

హైదరాబాద్,మార్చి24 : క్షయవ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఇది సమాజానికి పట్టిన చీడ అన్నారు. కేం÷-దర రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి న ఇవారణకు అనేక చర్యలు

-మిగతా 2 లో..



జనం వార్త



## నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం

(మొదటిపేజీ తరువాయి)

జరపాలని.. సీసీటీవీ ఫుటేజి, బాడీ-కెమెరా రికార్డింగ్‌ల వంటి ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను భద్రపరిచేలా చూడాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు. గాయపడిన నిరసనకారులకు నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వాలని వారు అభ్యర్థించారు. నీట్ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలన్న అభ్యర్థనపైనా సుప్రీం కోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఎన్‌టీఏ నిర్వహించే పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీని నివారించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ప్రస్తావించింది. నందన్ నీలేకని నేతృత్వంలోని ఈ కమిటీ ఆన్‌లైన్ పరీక్షా విధానం కోసం ఎలాంటి సూచనలు చేస్తుందో చూద్దామని సుప్రీం కోర్టు పేర్కొంది. దాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

## హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి రంగనాథ్‌ను తప్పించండి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది.

## వాళ్లకు అడ్డుపడటమే నేను చేసిన తప్పు : రంగనాథ్



**హైదరాబాద్:** హైడ్రా కమిషనర్‌గా ఈ రెండేళ్ల కాలంలో చెరువులు, పార్కులను రక్షించానని.. రూ.1.5 లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడామని రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "బడా బాబులు ఆక్రమించిన వందల ఎకరాలను ధైర్యంగా కాపాడాం. ల్యాండ్ మాఫియా, కబ్జాదారు లు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు. శాంతా శ్రీరామ్ అనే స్థిరాస్తి సంస్థ సుమారు రూ.10 వేల కోట్ల విలువైన లోతుకుంట భూమిని కొట్టేయాలని చూసింది. అనుమతి లేకుండా చారిత్రక గుట్టలను బ్లాస్టింగ్ చేస్తున్నారు. చెట్లు, గుట్టలను శాంతా శ్రీరామ్ సంస్థ విచ్చలవిడిగా విధ్వంసం చేసింది. సేవ్ ది రాక్స్ ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. నాపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు బడా భూకబ్జాదారులు వేసినవే. బతుకమ్మకుంట చెరువును మింగేయాలని ఒకరు చూశారు. లోతుకుంటలో రూ.వేల కోట్ల ప్రభుత్వ భూమిని కొట్టేయాలని మరొకరు చూశారు. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి కాంప్లెక్సులు కట్టాలని సంధ్యా శ్రీధర్‌రావు చూస్తున్నారు. సింగరేణి కార్మికుల ప్లాట్లను కొట్టేయాలని నల్ల మల్లారెడ్డి చూశారు. విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములను ముఖీం ఆక్రమించారు" అని రంగనాథ్ తెలిపారు. "అక్రమార్కులందరికీ హైడ్రా కమిషనర్‌గా అడ్డుపడటమే నేను చేసిన తప్పు. కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాను. నాకు న్యాయస్థానాలు, చట్టాలపై పూర్తి నమ్మకం, గౌరవం ఉన్నాయి. గత, ప్రస్తుత, భవిష్యత్తు ప్రభుత్వాలు ఏ బాధ్యతలు ఇచ్చినా పని చేస్తాను. ఏ పని అప్పగించినా 100 శాతం ఫలితాలు ఇవ్వడమే నా లక్ష్యం. భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధతతో పనిచేస్తాను" అని రంగనాథ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.



## ఆ నియామకాలు చెల్లవ్..

- విజయ్ సర్కార్‌కు హైకోర్టులో షాక్
- ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు
- కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పపై ఆక్షేపణ

**చెన్నై, జూలై 27 :** విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. "ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు" అని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

# లోక్‌సభ వాయిదా..

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో



అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు. కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో విఫలం

- విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం
- యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖ అప్పగించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు డిమాండ్



**హైదరాబాద్,జులై 27 :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యవ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడు తున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.



## సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు. అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రంలో ఏ విద్యార్థి ఆకలితో ఉండకూడదు

(మొదటిపేజీ తరువాయి)



అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## నెట్టెంపాడు, కోయిల్ సాగర్ మోటర్లు ఆన్ చేయాలి

**మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**

**మహబూబ్ నగర్, జూలై 27 :** జూరాల ప్రాజెక్టుకు 27,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, మోటార్లను ఎందుకు ప్రారంభించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. జూరాల ప్రాజెక్టులో ఇప్పటికే 7.1 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి చేరుకుందని వెల్లడించారు. మరికొద్ది గంటల్లో గేట్లు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారని వివరించారు. పాలమూరు రైతుకు నీళ్లు అందించకుండా, ఆ నీటిని శ్రీశైలం ద్వారా ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడుకు వెళ్లేలా చేయడానికే పంపులను ఆన్ చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని, వరదొచ్చినప్పుడు నీటిని ఎత్తిపోయ కుండా కిందికి జార విడుస్తుందని విమర్శిం చారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కంటే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలే ముఖ్యమని ఆరోపించారు. తక్షణమే భీమా-1లోని భూత్‌పూర్, సంగంబండ, భీమా-2లోని శంకర సముద్రం, రంగసముద్రం, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని గూడెం దొడ్డి విడుదల చేసి నింపాలని కోరారు. ర్యాలంపాడు , అలాగే కోయిల్‌సాగర్‌రిజర్వాయర్లను నింపేందుకు వెంటనే మోటార్లను ప్రారంభించాలని, జూరాల ఎడమ, కుడి కాలువలకు పూర్తి సామర్థ్యంతో నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



## మాజీ ఎమ్మెల్యే పెద్దికి కేసీఆర్ పరామర్శ

(మొదటిపేజీ తరువాయి)

పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

జనం వార్త
మంగళవారం 28 జూలై 2026


# కేంద్రం హామీలను నిలబెట్టుకోవట్లేదు

- కేసుల ఎత్తివేతపై కదలిక లేని ఉత్తర్వులు
- ఇలాగే వ్యవహరిస్తే మళ్లీ ఆందోళనలు
- న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం
- కాక్రోచ్ జనతాపార్టీ నేతల వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 27 :** నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయ-సహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మరియు ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.



## మెట్రో ప్రయాణికులకు మెరుగైన సేవలు

- మరింత సౌకర్యవంతంగా స్టేషన్లకు రూపకల్పన
- అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 27 :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ఎ÷-లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు, ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు, మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ, పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితు ల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరు ను ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

**కసరత్తు చేస్తున్న ప్రభుత్వం**

**హైదరాబాద్, జూలై 27 :** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సర్కార్ అండ?

- న్యాయపరమైన పోరాటానికి సిద్ధం అవుతున్న ప్రభుత్వం
- న్యాయ కోవిదులతో చర్చించి అప్పీల్ చేసే అవకాశం
- హైడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్



**హైదరాబాద్, జూలై 27 :** హైడ్రా చీఫ్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హైడ్రా చీఫ్ రంగనాథ్‌కు మద్దతుగా ప్రభుత్వం నిలవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంశంలో లీగల్ ఒపీనియన్ తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో తెలంగాణ ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్‌ను న్యూఢిల్లీ పంపించారు. అలాగే గతంలో కోర్టు ధిక్కారణ పిటిషన్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందిన తర్వాత.. సింగిల్ బెంచ్ తీర్పుపై డివిజన్ బెంచ్‌కు వెళ్లాలని యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. లోతుకుంట భూముల కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌పై సోమవారం తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని తెలంగాణ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని అభిప్రాయ పడింది. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో న్యాయ సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. ఇదిలావుంటే హైదరాడ్రాను రద్దు చేయాలని బిజెపి డిమాండ్ చేసింది. రాష్ట్రంలో హైడ్రాను నిషేధిస్తే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని తెలంగాణ బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ అంశంపై సోమవారం ఆయన స్పందించారు. ఈ తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టులాంటిదని అభివర్ణించారు. రంగనాథ్‌ను బలిపశువు చేశారని చెప్పారు. రేవంత్, ఎంఐఎం కనుసన్నల్లో హైడ్రా నడిచిందని విమర్శించారు. ఫాతిమా కాలేజీ, బడాబాబుల జోలికి హైడ్రా వెళ్లడంలేదని గుర్తు చేశారు. తొలి నుంచి పేదల ఇళ్లే హైడ్రా టార్గెట్ చేసిందని మండిపడ్డారు. హైడ్రాను రద్దు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను టీబీజేపీ చీఫ్ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన్ని తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. కోర్టు ఆదేశాలను ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు స్వాగతించాయి.




## సిరిసిల్ల విద్యార్థికి కేటీఆర్ అండ

**ఐఐటిలో సీటు సాధించినందుకు అభినందన**

**ల్యాప్‌టాప్ బహుకరణ..ఫీజు చెల్లింపునకు హామీ**

**హైదరాబాద్,జూలై27 :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుచేసుకున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్‌కు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. కాలేజీ ఫీజును కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలతతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద ల్యాప్‌టాప్ అందజేశారు. అంతేకాకుండా అభినవ్ కాలేజీ ఫీజును కూడా తానే చెల్లిస్తానని భరోసా ఇచ్చారు.కేవలం చదువు మీద దృష్టి పెట్టి.. తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినవ్‌కు కేటీఆర్ సూచించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు అభినవ్, అతని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరువబోమని, కేటీఆర్‌కు రుణపడి ఉంటామని అన్నారు.

## ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు

**నివేదిక ఎప్పుడు అందేదీ ఇప్పుడే చెప్పలేం**

**అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై రాజ్యసభలో కేంద్రం**

**న్యూఢిల్లీ, జూలై 27 :** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై రాజ్యసభలో కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. తుది నివేదికల విడుదలపై తలెత్తుతున్న ప్రశ్నలపై బదులిస్తూ.. ఈ కేసు దర్యాప్తులో ఎటువంటి ఆలస్యం జరగలేదని స్పష్టంచేసింది. అదేమీ చిన్న సంఘటన కాదని.. అటువంటి భారీ ప్రమాదాల దర్యాప్తును పూర్తి చేయడానికి సమయం పడుతుందని తెలిపింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తు అనేక అంశాలు.. వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని.. అందువల్ల తుది నివేదిక కోసం ఎంత సమయం పడుతుందనే విషయాన్ని ముందుగానే అంచనా వేయడం సాధ్యం కాదని వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందని పౌర విమానయానశాఖ పేర్కొంది. నిర్దేశిత విధానాల ప్రకార దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి తుది నిర్ణయానికి రాలేదని వెల్లడించింది. ప్రస్తుతం విమాన 'థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్' ను తనిఖీ చేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపింది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే



## విద్యార్థులపై దాడికి అమిత్ షా క్షమాపణలు చెప్పాలి : చామల

**న్యూఢిల్లీ, జూలై 27 :** విద్యార్థులపై జరిగిన అమానుష దాడికి కేంద్ర హోంమంత్రి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో అంతా అయిపోయిందని కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపు కుంటే ఉపేక్షించేది లేదు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలంటే ప్రభుత్వం భాధ్యతతో వ్యవహరించాలి. సింగపూర్, బ్రిటన్ లాంటి దేశాల్లో జెన్‌జీకి చట్టసభల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. భారత్‌లో కూడా 21 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతకు చట్టసభలో ప్రాతినిధ్యం కల్పిస్తే.. వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి, సమస్యలు పరిష్కారం చేయవచ్చు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని ఇండియా కూటమి నేతలకు తెలంగాణ ముఖ్యమంత్రి వివరించనున్నారు' అని చామల తెలిపారు.

# పలు జిల్లాలకు భారీ వర్ష సూచన

**బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం**



**హైదరాబాద్, జూలై 27 :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

## హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు

**బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



**హైదరాబాద్, జూలై 27 :** వరుస వివాదాల నేపథ్యంలో హైకోర్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలని చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేయడంపై బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. రంగనాథ్ మీదున్న 63 కోర్టు ధిక్కరణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయ స్థానం ఇన్ని ఉల్లంఘలనకు పాల్పడుతున్న అధికారిని ఇంకా కొనసాగిస్తే రూల్ ఆఫ్ లా అదుపు తప్పుతుందని, రంగనాథ్ స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని హైకోర్టు తెలిపిందన్నరు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డికి చెంపదెబ్బలాంటిదన్నారు. రేవంత్ రెడ్డికి ఏ మాత్రం కూడా తెలంగాణను పరిపాలించే నైతిక అర్హత లేదని ఇవాళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ద్వారా తేలిపోయింది. లక్షమంది పోలీసులున్న ఈ రాష్ట్రంలో హోంమంత్రి అయిన సిఎం హైకోర్టు స్థానిక పోలీసులెవరూ కూడా తెలంగాణ ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడలేరు. అందుకు ఆర్మీ అధికారులను ఆదేశించింది.. అంటే అసలు మీకు ఇక నైతిక హక్కు ఎక్కుడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతల ప్రభుత్వం. విధ్వంసకర ప్రభుత్వం. లగచర్లలో, వెలుగుమట్లలో నాశనం చేశారు. సున్నం చెరువు పేరుతో, బహదూర్ గూడ పేరుతో, లోతుకుంటలో ఎక్కడ చూసినా విధ్వంసమే. ఆ విధ్వంసం చేస్తూనే మరోవైపు పేదల భూములను మీ సొంత సోదరులు, మీ కాంగ్రెస్ పార్టీ నాయకులంతా కబ్జాలు చేస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూభారతి పోర్టల్‌ను తీసుకొని దొడ్డి దారిన దాదాపు 22 వేల ఎకరాల భూముల హక్కులను రాత్రికి రాత్రే ఎమ్మార్వో, ఆర్డీవోల సంతకాలు లేకుండా బదలాయించారు. అందుకే నేను గతంలో తెలంగాణ ప్రభుత్వంలో పనిచేసిన మీ అధికారిగా, సోదరుడిగా, ప్రభుత్వ అధికారులకు చెబుతున్నా దయచేసి రాజ్యాంగాన్ని పాటించండి. చట్టాన్ని పాటించండి.. కోర్టులు ఇచ్చిన ఆదేశాలను దయచేసి అతిక్రమించకండని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు.

# జవాబుదారీతనం కోల్పోవడంతోనే.. ప్రజా ఉద్యమాలు!




**దేశంలో యువత తక్షణ స్పందన కోరుకుంటోంది. సమస్యలపై తక్షణ చర్యలను కోరుతోంది. రాజకీయ నాయకులు లేదా పాలకులు సమస్యలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతు న్నారు. కావాలనే తాత్సారం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో తీవ్ర నిరాశా, నిస్పృహలు ఉ న్నాయి. ఏ సమయంలో చేయాల్సిన పనిని అప్పడే చేయడం లేదు. నాన్చివేత ధోరణి కారణంగా దేశం అడుగు ముందుకు వేయడం లేదు. జిఎస్టీని తీసుకుని వచ్చి గొప్పలు చెప్పారు. ప్రజలు దీనికి బలవుతున్నా పట్టించుకోలేదు. ఇప్పడు జిఎస్టీ శ్లాబ్‌లను తగ్గించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు. ఆహార ధరలు పెరుగుతున్నా పట్టింపు లేదు. మందుల మాఫియాను అరికట్టడం లేదు. అవినీతి వేళ్లూనుకుని పోయింది. అయినా పట్టించుకోవడం లేదు.**

ఇలా ఒకటేమిటి అనేకానేక సమస్యలు ఉన్నాయి. ఇవన్నీ పట్టించుకోక పోవడం వల్లనే ..నీట్ పేపర్ లీక్ తరవాత యువత ఉద్యమించింది. ఇది మొదలూ కాదు..అంతం కూడా కాదని పాలకులు గుర్తించాలి. ఇంతటితో ఇక పీడ విరగడ అయ్యిందని పాలకుల భావిస్తే అంతకుమించి మూల్యం చెల్లించుకో తప్పదు. యువత బొద్దింకలుగా మారి దేశ రాజధాని ఢిల్లీని చుట్టుముట్టే పరిస్థితి ఎందుకొచ్చిందని ఆత్మపరిశీలన చేసుకోవాలి. పార్లమెంట్ జరుగుతోంది. అయినా సమస్యలపై చర్చించడం లేదు. ఆరోరోజు కూడా విపక్షాలు ప్రధాని మోడీ, అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ సభాసమయాన్ని వృధా చేస్తున్నాయి. ఇది ప్రజల సమయం, ప్రజలు ఇచ్చిన అధికారం అని గుర్తించాలి. ఇలాగే చేస్తూ పోతే..పార్లమెంటులో గబ్బిలాల్లా ఏళ్ల తరబడి పట్టుకుని వేళ్లాడుతున్న నేతలను కూడా తొలగించడానికి ఉద్యమించక తప్పదేమో. ప్రశ్నపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనేక సందర్భాలలో జరిగాయి. దశాబ్దాల క్రితం ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలు కూడా ఉన్నాయి. కానీ ఇప్పుడే ఎందుకింత ఉద్యమం జరిగిందంటే కారణం యువతలో ఉన్న ఆక్రోశమని గుర్తించాలి. నాయకుల తీరుపట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో నిరాశా నిస్పృహలు పెరిగిపోతున్నాయని గ్రహించాలి. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే మూల స్తంభాలు తమ బాధ్యతల నుంచి దూరం జరగడం కూడా ప్రస్తుత దుస్థితికి కారణం.చట్టసభల్లో సమస్యలపై చర్చించి, వాటికి పరిష్కారం చూపడం లేదు. అసలు సమస్యలనే గుర్తించడం లేదు.

ఇకవాటిపై చర్చల గురించి ఆలోచన తరవాత. ప్రధాన ప్రతిపక్షం సమస్యలపై చర్చ చేయకుండా సభను స్తంభింప చేయడం మాత్రమే చేస్తోంది. అధికార పక్షం ప్రజల సమస్యలకు జవాబు ఇవ్వండ లేదు. కేవలం తమ స్వప్రయోజనాల కోసం పార్లమెంటును నడపుతున్నారా అన్న భావన కులుగుతోంది. బొద్దింకలు చేపట్టిన ఆందోళన విరమణతో ప్రస్తుత సమస్య తాత్కాలికంగా సమసిపోతే పోవచ్చు. కానీ ప్రధాన వ్యవస్థలు తమ బాధ్యతను గుర్తించి మెలగని పక్షంలో మరో సమస్య వచ్చినప్పుడు ఆందోళనలు ఇంతకు మంచి ఊపందుకుంటాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్నందువల్లే మనం స్వేచ్ఛగా జీవించగలుగుతున్నాం. దానిని బలహీనపరచడమంటే ప్రజాస్వామ్యం మనుగడే ప్రమాదంలో పడుతుంది. వ్యవస్థలకు వ్యతిరేకంగా కాకుండా వాటిల్లో జవాబుదారీ తనాన్ని తీసుకురావడానికి పోరాడవలసిన సమయం ఇప్పుడు ఆసన్నమైంది. కాక్రోచ్ జనతా పార్టీ కోరుతున్నది అదే కనుక నేతలు తమ పద్దతిని మార్చుకుంటే మంచిది. ముఖ్యంగా రాజకీయ పార్టీలు కూడా ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒక సామాన్యుడైన అభిజీత్ దీప్కే ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీ వెనుక నిలబడడం ద్వారా కాంగ్రెస్ తదితర పార్టీలు ఓ రకంగా తమ ఉనికిని కోల్పోయానే చెప్పాలి. వారు చేయాల్సిన పనిని వారి పార్టీలు చేయలేకపోయాయి. ఈ దుస్థితి ఎందుకొచ్చిందో రాజకీయ పార్టీలు ప్రశ్నించుకోవాలి.

సామాన్య ప్రజలు చేపట్టిన ఆందోళనకు దిగి రావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చిందో పాలకులు కూడా గ్రహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలను, ప్రత్యర్థులను భయపెడుతూ ఎంతో కాలం మనుగడ సాగించలేమని పాలకులు గుర్తించాలి. ప్రజాస్వామ్యం మౌలిక సూత్రాలను ఆచరించి అమలు చేస్తామన్న నమ్మకాన్ని పాలకులు ప్రజల్లో కల్పించాలి. . పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన తరవాతనే కేంద్ర ప్రభుత్వ పెద్దలు అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. సోషల్ మీడియా ఇంతలా విస్తరించిన ఈ కాలంలో ఏ విషయాన్ని కూడా దాచిపెట్టలేమని ప్రభుత్వాలు, ప్రధాన పార్టీలు గుర్తించాలి. ముఖ్యంగా యువతలో పేరుకుపోతున్న నిరాశా నిస్పృహలకు సమాధానం చెప్పాలి. పార్లమెంటులో ఎప్పటికప్పుడు ప్రధాన సమస్యలపై అర్థవంతమైన చర్చలు సాగాలి. సమస్యలు పరిష్కారం అయ్యేలా తక్షణ చర్యలకు పూనుకోవాలి. దాశాబ్దాలుగా సమస్యలను నానపెడుతూ మరిని కొత్త సమస్యలకు కారణం కారాదు. అలాగే పాలకలు విలాసాలు వీడాలి. ప్రజల సొమ్మకు జవాబుదారీ తనాన్ని అలవర్చుకోవాలి. జల్సాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ఇప్పటికైనా ముగించాలి. లేదంటే ఏ చిన్న సంఘటన జరిగినా ఆందోళనలు మరింత ఉదీథంగా పుట్టుకురావొచ్చు. ఇప్పుడున్న నేతలు ఎవరినీ ప్రజలు ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానిని అధిగమించకపోతే పాలకులకు ఎదురుదెబ్బలు తప్పవు..



**రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ మరోమా రు కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవలి కాలంలో వరుసపెట్టి పెద్దపె పద్ద చేపలను పట్టేస్తోంది. చిన్నాచితక కేసులు నమోదు అవుతు న్నా, పెద్ద చేపల విషయంలో ఏసీబీ పక్కాగా సమాచారం సేకరిం చి దాడులు చేస్తోంది. దాడుల్లో వందల కోట్ల ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తోంది. అవినీతి పట్ల ప్రభుత్వం కూడా కఠినవైఖరి అవలంబిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నిత్యం సంబంధం ఉండే శాఖల్లో అవినీతి ఎక్కువగా ఉందనే ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ ఆయా శాఖల అధికారులపై దృష్టి కేంద్రీకరించింది.**

## అవినీతి అధికారుల
# గుండెల్లో రైళ్లు

**వరుసపెట్టి దాడులు చేస్తున్న ఏసీబీ**

**వందల కోట్లలో అక్రమాస్తుల గుర్తింపు**

**హైదరాబాద్, జూలై 27 :** ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులు, ఇంటెలిజెన్స్, విజిలెన్స్ విభాగాల నుంచి అందిన సమాచారం ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన 100 మంది అధికారులపై నిఘా కొనసాగుతోంది. ఇప్పటికే 65 మంది అధికారులపై ప్రాథమిక స్థాయిలో సమా చారం సేకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఏసీబీ దృష్టిలో అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, జీహెచ్ఎంసీ, ఆర్టీఏ, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ శాఖలు ప్రజలకు నేరుగా సేవలు అందించే విభాగాలు కావడంతో లంచా లు, అక్రమ లావాదేవీలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గతంలో వచ్చిన ఆరోపణలు సూచించాయి. కేవలం ఫిర్యాదుల ఆధారంగా కాకుండా గత ఆరు నెలలుగా అనుమానిత అధికా రుల ఆర్థిక లావాదేవీలు, స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాలు, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తులు, బినామీ లావాదేవీలు వంటి అంశాలపై ఏసీబీ నిఘా పెట్టినట్లు సమాచారం. దీని కోసం వీడియో రికార్డింగ్‌లు, డాక్యుమెంటరీ ఆధారాలు, రిజిస్ట్రేషన్ వివ రాలు, బ్యాంకింగ్ లావాదేవీలు వంటి సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే దాడులు, కేసులు నమోదు చేసే విధానాన్ని ఏసీబీ అనుసరిస్తోంది. ఇటీవలి కాలంలో ఆదాయానికి మించిన ఆస్తులు కేసుల్లో పలువురు ప్రభుత్వ అధికారులపై కేసులు నమోదు చేసిన ఏసీబీ ఇప్పటికే 10 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచిన ట్లు సమాచారం. ఈ చర్యలు మిగతా అధికారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించబోమని ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి స్వేచ్ఛ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. శిక్షలు కఠినంగా ఉంటేనే మిగతా అధికారులకు హెచ్చరికగా నిలుస్తాయని ప్రభుత్వ పెద్దలు కూడా అభిప్రాయపడినట్లు సమాచారం. అవినీతిని అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత ముఖ్యమైనది. లంచం డిమాండ్ చేసిన అధికారులు లేదా అక్రమాస్తులపై విశ్వసనీయ సమాచారం ఉంటే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ లేదా ఇతర అధికారిక మార్గాల ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు తరచూ సూచిస్తున్నారు. అవినీతి కేసుల్లో దాడులు నిర్వహించడం ఒక దశ మాత్రమే. అనంతరం ఆస్తుల మూలాలను నిరూపించడం, కోర్టులో బలమైన సాక్ష్యాలను సమర్పించడం, చివరకు శిక్షలు పడేలా చేయడం మరింత కీలకమైన ప్రక్రియ. గతంలో కొన్ని కేసులు సాక్ష్యాల లేమితో బలహీనపడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అందువల్ల ఈసారి పక్కా ఆధారాలతోనే ముందుకు వెళ్లాలని ఏసీబీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

**ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ డిమాండ్**



**న్యూఢిల్లీ, జులై 27 :** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పెలెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణెళి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## బీహార్ బంద్‌లో ఎకే 47తో కాల్పులు

**సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియోలు**

**పాట్నా, జులై 27 :** రెండు రోజుల క్రితం 'బిహార్ బంద్' సందర్భంగా శివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఒక పోలీసు సిబ్బంది'ఏకే-47'రైఫిల్‌తో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. ఈనెల 25న బిహార్‌లో విద్యార్థి సంఘాలు చేపట్టిన ఈ బంద్ సందర్భంగా పలు జిల్లాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా, వారిని పాట్నాలోని జయప్రభ మేదాంత ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల మహమ్మద్ ఆరిఫ్ అనే యువకుడు కూడా ఉన్నాడు. బంద్ కారణంగా దుకాణం మూసివేసి ఇంటికి తిరిగి వెళ్తుండగా మెడకు బులెట్ తగిలిందని కుటుంబసభ్యులు తెలిపారు. వైద్యులు శస్త్రచికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారని, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కాల్పుల ఘటనపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేస్తూ... కాల్పుల ఘటనకు సంబంధించిన వీడియోను నెట్‌లో షేర్ చేశాడు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ.. ఢిల్లీలో నిరసన తెలిపే విద్యార్థులపై పెలెట్ తుపాకులు, బిహార్‌లో ఏకే-47లు ప్రయోగిస్తున్నారంటూ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

## టొరంటోలో దారుణ ఘటన

**భారత సంతతి యువతిపై కాల్చివేత**

**టొరంటో,జులై 27 :** కెనడాలోని టొరంటో నగరంలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. 26 ఏళ్ల భారత సంతతికి చెందిన నవ్‌నీత్ కౌర్ అనే యువతిని ఓ వ్యక్తి దారుణంగా కాల్చి చంపాడు. ఇది ఒక పథకం ప్రకారం జరిగిన దాడి అని టొరంటో పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. శుక్రవారం ఉదయం 7:23 గంటల ప్రాంతంలో హంబర్‌వుడ్ బౌలేవర్డ్, రెక్స్‌డేల్ బౌలేవర్డ్ సమీపంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రత్యక్షసాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. నవ్‌నీత్ కౌర్ వీధిలో నడుచుకుంటూ వెళ్తుండగా, సదరు వ్యక్తి ఆమెను అనుసరించాడు. అతడు ఏదో మాట్లాడటంతో నవ్‌నీత్ వెనక్కి తిరిగి చూసింది. వారిద్దరి మధ్య స్వల్ప సంభాషణ జరిగింది. ఎలాంటి గొడవ లేదా వివాదం జరిగిన సూచనలు కనిపించకుండానే, అతడు వెంటనే తుపాకీ తీసి ఆమెపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన నవ్‌నీత్‌కు అత్యవసర వైద్య సాయం అందించినప్పటికీ, ఆమె అక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఘటన జరిగిన వెంటనే రంగంలోకి దిగిన టొరంటో పోలీసులు, నిందితుడిని పట్టుకోవడానికి డ్రోన్లు, ప్రత్యేక డాగ్ స్క్వాడ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నాటికి ఈ హత్య కేసులో నిందితుడైన 37 ఏళ్ల శరంజిత్ సింగ్ అనే వ్యక్తిని బ్రాంప్టన్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. నిందితుడిపై ముందస్తు ప్రణాళికతో చేసిన హత్య),కోర్టు నిబంధనలను ఉల్లంఘించినట్లు కేసులు నమోదు చేశారు. హత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుపై పోలీసుల హోమిసైడ్ టీమ్ విచారణ జరుపుతోంది. ఈ దాడిలో ఇతర నిందితుల ప్రమేయం ఏమీ లేదని భావిస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు.



## ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

**శాకంబరిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ**

**విజయవాడ, జులై 27 :** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ సన్నిధిలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ రకాల ఆకుకూరలు, పండ్లు, కూరగాయల అలంరాంతో దుర్గమ్మ దర్శనమిస్తున్నారు. మూలవిరాట్‌తో పాటు ఆలయ ప్రాంగణమంతా కూరగాయలతో అలకరించారు. ఆషాఢ మాసంలో ప్రత్యేకంగా శాకంబరీ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సకాలంలో వర్షాలు పడి, పాడిపంటలు పండి, దేశం సస్యశ్యామలంగా ఉండేందుకు ప్రతి ఏడాది శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో శాకంబరీ దేవిగా దుర్గమ్మ దర్శనమిస్తారు. ఉత్సవాల సందర్భంగా దుర్గమ్మ సన్నిధికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జై దుర్గా.. జై జై దుర్గా నామస్మరణతో ఇంద్రకీలాద్రి మారుమోగుతోంది. అమ్మవారి ఒంటి మీద నుంచి తీసిన శాఖాలతో కదంబ ప్రసాదాన్ని తయారు చేసి భక్తులకు పంపిణీ చేస్తారు. కదంబ ప్రసాదాన్ని స్వీకరిస్తే అనారోగ్యాలు పోయి ఆరోగ్యంగా ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## కోలుకుంటున్న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

**అమరావతి, జులై 27 :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోలుకుంటున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్త్రపి వర్గాలు తెలిపాయి. శనివారం హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఇటీవల కొద్దిరోజులు తీవ్ర కడుపునొప్పితో బాధపడిన ఆమె ఉదయం ఆస్పత్రిలో చేరగా వైద్యులు వెంటనే పరీక్షలు జరిపి.. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడ ఉందని ధ్రువీకరిస్తూ ఏపీసీసీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్నును సమీక్షించి సరి చేయాలి

**నాగర్‌కర్నూల్, జూలై 27 (జనం వార్త) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో రమేష్ కుమార్ కు బీసీ పొలిటికల్ జేఏసీ తరపున ఉపాధ్యాయుల డిప్యూటేషన్ను సమీక్షించి సరిచేయాలని బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధన్నోజు అరవింద్ చారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పటిష్టత కోసం చేస్తున్న కృషిని అభినందిస్తూ గత విద్యా సంవత్సరంలో 2025 -26 లో చాలామంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలల నుండి అక్రమ మార్గంలో డిప్యూటేషన్ చేయించుకోవడం వల్ల. ప్రభుత్వ పాఠశాలలో చదివే బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది. ఈ విద్యా సంవత్సరం 2026- 27 కు సంబంధించి అదే డిప్యూటేషన్ను కొనసాగిస్తూ ఉండటం వల్ల విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలో నష్టపోయే అవకాశం ఉందని మండిపడ్డారు. కాబట్టి జిల్లాలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల నుండి డిప్యూటేషన్ పై వెళ్లి వారి సొంత పాఠశాల విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ఉపాధ్యాయుల అక్రమ డిప్యూటేషన్ను సమీక్షించి వారి సొంత పాఠశాలలకు తిరిగి పంపాలని బీసీ పొలిటికల్ జేఏసీ తరపున అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఇలా చేయకపోతే తక్కువ శాతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలు తీసివేసే ప్రమాదం ఉందని బీసీ పొలిటికల్ జేఏసీ నా గర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు రాజు, ఉపాధ్యక్షులు అబ్బ కరుణాకర్, బిజినపల్లి మండల అధ్యక్షులు సత్యశిల సాగర్, బోట్క మన్నెం, పాపని నరేందర్, రమేష్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.




## డీఈవోను సస్పెండ్ చేయాలని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ డిమాండ్

**నాగర్‌కర్నూల్, జూలై 27 (జనం వార్త) :** నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు మద్దెల బండ సాయిబాబు మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో డీఈవో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల అక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, సమాచార హక్కు చట్టం అమలులో లోపాలపై విమర్శలు చేశారు. విద్యాశాఖ పనితీరుపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని డీఈవోను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు జన్ను ఆంజనేయులు, వరుణ్, జగదీష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం

**నాగర్‌కర్నూల్, జూలై 27 (జనం వార్త) :** నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెంలో ఓ తండాకు చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆచూకీ కోసం ప్రత్యేక బృం దాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## మంగపేటలో బీజేపీ మండల కార్యవర్గ సమీక్ష సమావేశం

- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- జిల్లా భాజపా అధ్యక్షుడు సిరికొండ బలరాం

**ములుగు, జూలై 27 :** ములుగు జిల్లా మంగపేట మండలంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మండలంలోని ప్రజా సమస్యలు, బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం, 2026 ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్) అంశాలపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా కృషి చేసి పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని సిరికొండ బలరాం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్య జవహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవీంద్రాచారి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రామిడి సురేష్ పటేల్, జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రావుల జానకిరావు, సీనియర్ నాయకులు పాకనాటి వెంకటరెడ్డి, కున్నం వెంకటరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు యర్రం వీరన్ కుమార్, జిల్లా బీజేవైఎం కార్యదర్శి కట్టుకోజు ప్రశాంత్, మండల ప్రధాన కార్యదర్శులు బొల్లికొండ సాంబయ్య, నిడదవోలు శ్రీనివాస్, బడే జగన్మోహన్, మండల కార్యదర్శులు కుందారపు రోహిత్ కుమార్, ఇస్లావత్ శివకుమార్, బట్ట సతీష్, బూత్ అధ్యక్షులు, మహిళా నాయకురాలు కాక లక్ష్మితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రేమను పంచండి..
# పిల్లలకు స్నేహితులవ్వండి

- పిల్లల పెంపకంలో ప్రేమ, నమ్మకం, సంభాషణలే విజయానికి పునాది
- పేరెంట్స్ డే సందర్భంగా ఆర్గాన్ న్యూస్ ప్రత్యేక కథనం

**పిల్లలను జీవిత లక్ష్యానికి చేర్చే వాహనం క్రమశిక్షణ అయితే, ఆ వాహనానికి ఇంధనం తల్లిదండ్రులు పంచే ప్రేమ, ఆప్యాయత, నమ్మకం. ఆప్యాయంగా నిద్రలేపి, బాధ్యతతో పనులు చేయించి, ప్రేమగా నిద్రపుచ్చే బాధ్యత తల్లిదే అయితే... జీవితానికి దారి చూపుతూ గురువుగా, మార్గదర్శిగా, చివరికి స్నేహితుడిగా మారి పిల్లలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తండ్రిదని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్న మాటలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.**



**రంగారెడ్డి, జూలై 27 :** ప్రతి సంవత్సరం జూలై 28న జరుపుకునే పేరెంట్స్ డే సందర్భంగా తల్లిదండ్రులు పిల్లలతో తమ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఇది మంచి అవకాశం. పిల్లలు ఎదుగుతున్న కొద్దీ వారి ఆలోచనలు, అభిరుచులు, నిర్ణయాలు మారుతుంటాయి. అలాంటి సమయంలో వారిని శాసించడం కంటే అర్థం చేసుకోవడం, విమర్శించడం కంటే వినడం, ఆదేశించడం కంటే మార్గనిర్దేశం చేయడం ఎంతో అవసరమని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

### పిల్లలకు స్నేహితులుగా మారండి

టీనేజ్‌లో పిల్లలు ఎన్నో సందిగ్ధ పరిస్థితులను ఎదుర్కొంటారు. ఆకర్షణలు, కొత్త స్నేహాలు, వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవాలనే తపన, సామాజిక ఒత్తిళ్లు వారిని అయోమయానికి గురిచేస్తాయి. బయటకు చెప్పకపోయినా, సరైన మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తుంటారు. ఆ సమయంలో తల్లిదండ్రులు స్నేహితుల్లా ఉంటే పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా పంచుకుంటారు. యుక్తవయసులో పిల్లలు చేసే ప్రతి పొరపాటును పెద్ద సమస్యగా చూడకుండా, ఓర్పుతో వివరించడం అవసరం. ఆగ్రహం, శిక్ష, అవమానం కంటే ప్రేమతో చెప్పిన మాటలు ఎక్కువ ప్రభావం చూపుతాయి. పిల్లలు తప్పు చేస్తే వారిని తప్పుబట్టడం కాదు, ఆ తప్పును ఎలా సరిదిద్దుకోవాలో నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత.

### పోలికలు వద్దు... ప్రోత్సాహమే మేలు

"పక్కింటి పిల్లాడిని చూడు", "అతడిలా చదువు", "ఆమెలా ఉండు" అనే పోలికలు పిల్లల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ప్రతి చిన్నారికి ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దానిని గుర్తించి ప్రోత్సహించడమే తల్లిదండ్రుల గొప్ప బాధ్యత. అనుసరించడం నేర్పాలి కానీ అనుకరించడం కాదు. రోజుకు కనీసం ఒకసారి లేదా వారానికి కొన్ని రోజులు కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడం, మనస్ఫూర్తిగా మాట్లాడుకోవడం, పిల్లల అభిప్రాయాలను వినడం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుంది. ఆ సమయంలో మార్కులు, ర్యాంకులు, మందలింపులు కాకుండా సమాజం, సంస్కృతి, కళలు, పుస్తకాలు, జీవిత విలువల గురించి చర్చించడం పిల్లల్లో ఆలోచనా శక్తిని పెంచుతుంది.

### క్లాస్ పీకొద్దు... ఆదర్శంగా నిలవండి

యుక్తవయస్కులకు ఉపన్యాసాల కంటే తల్లిదండ్రుల ప్రవర్తనే పెద్ద పాఠం. పెద్దలను గౌరవించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ఇతరులతో మర్యాదగా ప్రవర్తించడం వంటి మంచి అలవాట్లను తల్లిదండ్రులు ఆచరిస్తే పిల్లలు సహజంగానే వాటిని అలవాటు చేసుకుంటారు. భయపెట్టి పెంచడం ఎంత ప్రమాదకరమో, అతిగా స్వేచ్ఛ ఇవ్వడం కూడా అంతే ప్రమాదకరం. ప్రేమతో కూడిన క్రమశిక్షణ, నమ్మకంతో కూడిన స్వేచ్ఛ, సంభాషణతో కూడిన మార్గదర్శకత్వం పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతుంది. పేరెంట్స్ డే సందేశం పిల్లలకు జీవితాంతం గుర్తుండిపోయే బహుమతి ఖరీదైన వస్తువులు కాదు... అమ్మానాన్నల ప్రేమ, సమయం, ప్రోత్సాహం, నమ్మకం. ఈ పేరెంట్స్ డే సందర్భంగా ప్రతి తల్లిదండ్రి తన పిల్లలతో మరింత స్నేహపూర్వకంగా మెలిగి, వారి కలలకు అండగా నిలవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## కోసూరి రమేష్ గౌడ్ సంతాప సభలో నివాళులర్పించిన మంత్రి తుమ్మల




**ఖమ్మం, జూలై 27:** సుడా మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కోసూరి రమేష్ గౌడ్ మృతిపట్ల రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రమేష్ గౌడ్ మృతి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాకుండా తనకు వ్యక్తిగతంగా కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం ఏ-బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, త్రీటౌన్ ఏరియా పార్టీ కోఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ అధ్యక్షతన కోసూరి రమేష్ గౌడ్ స్వగృహంలో నిర్వహించిన సంతాప సభలో మంత్రి తుమ్మల పాల్గొని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కోసూరి రమేష్ గౌడ్ రాజకీయ జీవిత ఆరంభం నుంచి తనతో కలిసి పనిచేస్తూ పార్టీకి అంకితభావంతో సేవలందించారని గుర్తు చేశారు. నిరాడంబర వ్యక్తిత్వం, నిగర్వి స్వభావంతో అందరి అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడిగా ఆయన నిలిచారన్నారు. రమేష్ గౌడ్ మరణం పార్టీకి, ఖమ్మం ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. రమేష్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం, గుండె నిబ్బరం ప్రసాదించాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు. సంతాప సభలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్ బాబా, మాజీ మేయర్ పూనకొల్లు నీరజతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పాల్గొని కోసూరి రమేష్ గౌడ్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఆదివాసీల హక్కుల కోసం సీపీఎం భారీ పోరాటం

- వేలాది మందితో ఐటీడీఏ ముట్టడి
- అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని డిమాండ్
- హక్కులు కాలరాస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




**ములుగు, జూలై 27 :** తరతరాలుగా సాగు చేస్తున్న ఆదివాసీల భూములకు అటవీ హక్కుల చట్టం--2006 ప్రకారం వెంటనే హక్కు పత్రాలు మంజూరు చేయాలని, ఫారెస్ట్ అధికారుల దాడులు, కందకాలు (ట్రెంచ్‌లు) తవ్వడం, బలవంతపు ప్లాంటేషన్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ములుగులో భారీ ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు. వై జంక్షన్ నుంచి డోలు వాయిద్యాలతో వేలాది మంది ఆదివాసీలు ర్యాలీగా ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టొప్పో సీపీఎం నాయకులను చర్చలకు ఆహ్వానించారు. సమావేశం అనంతరం వినతిపత్రం స్వీకరించిన ఆయన, ఆదివాసీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సానుకూలంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములపై ఆదివాసీలకు చట్టబద్ధమైన హక్కులు ఉన్నప్పటికీ అటవీ హక్కుల చట్టం అమలులో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. హక్కు పత్రాల కోసం లక్షలాది దరఖాస్తులు వచ్చినా అర్హులందరికీ పట్టాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అటవీ శాఖ అధికారులు ఆదివాసీల సాగు భూముల్లో బలవంతంగా ప్లాంటేషన్లు చేపట్టడం, కందకాలు తవ్వడం, రైతులను వేధించడం, భూముల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేయడం అన్యాయమని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి ఆదివాసీకి వెంటనే అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల హక్కులను హరించే చర్యలు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ గిరిజనులకు ప్రత్యేక హక్కులు కల్పించిందని గుర్తు చేశారు. 1/70 చట్టాన్ని బలహీనపరిచే కుట్రలను ఆదివాసులు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జీవో నెం.3ను వెంటనే పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల సహజ వనరులపై కన్నేసిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి అవతలి ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులకు కూడా షెడ్యూల్డ్ తెగ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని, 1993 షెడ్యూల్డ్ ట్రైబ్స్ చట్టం ప్రకారం వారికి న్యాయం చేయాలని కోరారు. అటవీ హక్కు పత్రాలు ఉన్న భూముల్లో కూడా ట్రాక్టర్లు అనుమతించకపోవడం, బోర్లు తవ్వనివ్వకపోవడం వల్ల ఆదివాసీలు వ్యవసాయంలో వెనుకబడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఫారెస్ట్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఆదివాసీలను వేధించడం, కందకాలు తవ్వడం, దౌర్జన్యాలకు పాల్పడడం వంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బి. సాంబశివ, కార్యదర్శివర్గ సభ్యులు ఎండి దావూద్, రత్నం రాజేందర్, గ్యానం వాసు, చిట్టిబాబు, రఘుపతి, గొంది రాజేష్, చిరంజీవి, దామోదర్, కుమ్మరి శ్రీను, బచ్చల కృష్ణబాబు, కట్ల చారి, నగేష్, కిష్టయ్య, ప్రవీణ్, రవి, చారి నరేష్, రాజు తదితర నాయకులతో పాటు సుమారు 2,000 మంది ఆదివాసీలు పాల్గొన్నారు.



జనం వార్త

# సీఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

## శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి, జులై 27 :** సీఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ధైర్యవంతులైన జవాన్లకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం చూసే ప్రతి శాంతియుత సూర్యోదయం.. చీకటి వేళల్లోనూ మెలకువగా ఉండే జవాన్ల ధైర్యంతో భద్రంగా ఉందన్నారు. వారి అచంచలమైన ధైర్యం, సాటిలేని క్రమశిక్షణ, నిస్వార్థ సేవ భారతదేశ అంతర్గత భద్రతకు ఒక శాశ్వతమైన స్తంభంగా నిలిచాయని కొనియాడారు. ఉగ్రవాదంతో పోరాడటంలో, వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించడంలో, ప్రకృతి వైపరీత్యాలకు స్పందించడంలో, లేదా సంక్షోభ సమయాల్లో పౌరులను రక్షించడంలో అయినా సీఆర్పీఎఫ్ ఎల్లప్పుడూ అసాధారణ శౌర్యంతో దేశం పట్ల అచంచలమైన నిబద్ధతతో ముందు వరుసలో నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతి యూనిఫాం త్యాగానికి ప్రతీక అని.. ప్రతి మిషన్ స్వార్థానికి అతీతమైన కర్తవ్యాన్ని ప్రతిబింబిస్తోందని, ప్రతి ధైర్యసాహసాల చర్య దేశ విశ్వాసాన్ని, ఐక్యతను బలపరుస్తోందని అన్నారు. ధైర్యవంతులైన సీఆర్పీఎఫ్ సిబ్బంది కుటుంబాలకు కూడా పవన్ వందనం తెలిపారు. వారి నిశ్శబ్ద త్యాగాలు, స్థిరమైన మద్దతు ప్రతి సీఆర్పీఎఫ్ యోధుని సంకల్పాన్ని బలపరుస్తాయని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# విశాఖను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతున్న బాబు

## మణిహారంగా మారనున్న భోగాపురం విమానాశ్రయం

**అమరావతి,జులై 27 :** గత రెండేళ్లలో ఉత్తరాంధ్ర, విశాఖలో వినూత్నమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారంమీడియాతో మాట్లాడుతూ.. విశాఖను దేశంలో నంబర్-1 నగరంగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మణిహారంగా నిలవనుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రధాని సభకు వచ్చే ప్రజల రవాణా కోసం సుమారు 2 వేల బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా దింసా నృత్యంతో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలుకుతామని మంత్రి అన్నారు. భోగాపురం విమానాశ్రయ ప్రయాణికులకు సాధారణ బస్సు ఛార్జీలతోనే ఎలక్ట్రిక్ బస్సు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ(ఒఖాఖిఅ) బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని... అందులో భాగంగా 1,400 కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలో దశలవారీగా మరో 1,050 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆధునిక, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందించడమే ప్రభుత్వ సంకల్పమని రాంప్రసాద్ రెడ్డి చెప్పుకొచ్చారు. భోగాపురం విమానాశ్రయం దూరమనే అపోహ అవసరం లేదని... హైదరాబాద్‌కు శంషాబాద్ విమానాశ్రయం ఎలా విజయవంతమైందో, భోగాపురం కూడా అలాగే అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని తెలిపారు. విశాఖ అంటే ఉత్తరాంధ్రకు గుండెకాయ అని.. విశాఖ అభివృద్ధే ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ సెల్ఫీ వీడియో ఆత్మహత్య కేసు నిందితులు అరెస్ట్

**తాడేపల్లిగూడెం, జులై 27 :** జర్నలిస్ట్ సెల్ఫీ వీడియో ఆత్మహత్య కేసు నిందితులు ఎట్టకేలకు అరెస్ట్ అయ్యారు. తాడేపల్లిగూడెం డిఎస్పి రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ తాడేపల్లిగూడెంకి చెందిన వీడియో జర్నలిస్ట్ ఉర్ల బాలకృష్ణ వర్ధన్ మృతికి సంబంధించి సెల్ఫీ వీడియో ఆధారంగా ప్రధాన నిందుతులు ఇద్దరని అరెస్ట్ చేశామన్నారు. జీతం ఇవ్వక, కుల దూషణ, సోషల్ మీడియాలో వేధింపులు నేపథ్యంలో మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. సోషల్ మీడియాలో దూషించుకోవడం వలన మనస్థాపం చెంది వర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని తన మృతికి కారణం రంగా సురేష్, శివ అని సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడు తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని కులం పేరుతో దూషించడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి నిందుతులను కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. టౌన్ సిఐ ఆది ప్రసాద్ ఎస్ఐ బాదం శీను ఈ సమావేశంలో పాల్గొన్నారు



# అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి

## జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

**ఏలూరు, జులై 27 :** జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి యం.శ్రీదేవి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు నుండి స్వీకరించిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోపుగా పూర్తిస్థాయి పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీదారులకు సంతృప్తిస్థాయి మరింత పెంచేలా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులుపై ఉందని స్పష్టం చేశారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించాలని అన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చక్కని పరిష్కారం అందించాలని ఆదేశించారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు

## నివేదిక సమర్పించాలన్న సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ,జూలై27 :** అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

# పోలీసులపై కారుతో దూసుకెళ్లిన యువకుడు

**కానిస్టేబుల్‌కు గాయాలు.. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు**

**హ్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు**

**హైదరాబాద్, జూలై 27 :** డ్రగ్స్ మత్తులో ఉన్న ఓ యువకుడు తనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైకే కారుతో దూసుకెళ్లిన ఘటన హైదరాబాద్‌లో కలకలం రేపింది. ఈ ఘటనలో ఓ హెడ్ కానిస్టేబుల్ కాలుకు తీవ్ర గాయాలు కాగా, ఇన్‌స్పెక్టర్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నిందితుడు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే ఆయన ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఓ కారు అబిడ్స్ చేరుకుంది. కారులోని వ్యక్తికి మరో వ్యక్తి వచ్చి అనుమానాస్పద ప్యాకెట్ అందజేయగా, అక్కడే మాటువేసిన పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కారులో ఉన్న నిందితుడిని బయటకు దిగాలని ఆదేశించారు. యితే కారు పక్కకు తీస్తున్నట్లు నటించిన నిందితుడు ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా నడిపాడు. ఈ సమయంలో అడ్డుకునేందుకు ప్రయత్నించిన హెడ్ కానిస్టేబుల్ మహేందర్ కాలు మీదుగా కారును ఎక్కించడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో పాటు మరో కానిస్టేబుల్‌కు కూడా గాయాలయ్యాయి. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించగా, ఇన్‌స్పెక్టర్ తన బృందంతో కలిసి వెంటాడారు. అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారును అడ్డుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌గా పోలీసులు గుర్తించారు. రోవైపు, కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌ను వెంటనే సోమాజిగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కానిస్టేబుల్ కాలును పరీక్షించిన వైద్యులు విరిగినట్లు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. మహేందర్ ఫిర్యాదు మేరకు నిందితుడు సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను అదుపులోకి తీసుకుని డ్రగ్స్ వ్యవహారంతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

# విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

## హైదరాబాద్ టెక్కీపై పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, జూలై 27 :** కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆయువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# చెవిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

## దొడ్డా బయిల్ రద్దు పిటిషన్ తిరస్కరణ



**న్యూఢిల్లీ,జూలై27 :** సుప్రీంకోర్టులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురైంది. ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడు దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌లో పలు సందేహాలను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏమైనా సందేహా లుంటే సరైన సమయంలో తమ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని వైసీపీ నేతకు ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారంటూ ఆ పిటిషన్‌లో వైసీపీ నేత చెవిరెడ్డి ఆరోపించారు. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు ఇచ్చిన ముందస్తు బెయిల్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ల ను అప్రూవర్‌లుగా మార్చి.. తద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ని ఇరికించేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు ఈ కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించిన సంగతి తెలిసిందే.

# పదో తరగతి విద్యార్థిని శివానీ మృతి

## సిఎం పర్యనటలో ఉత్సాహంగా మాట్లాడి.. అంతలోనే ఆత్మహత్య

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి**

**అమరావతి,జూలై27 :** సీఎం చంద్రబాబు రంప చోడవరం పర్యటనలో తన ప్రసంగంతో ఆకట్టుకున్న పదో తరగతి విద్యార్థిని ఎం. శివాని చనిపోవడం చాలా విషాదం కలిగించిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి శివాని మృతిపై సోమవారం రాజధాని అమరావతిలో ఆమె స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివానీ ఇక లేదంటే నమ్మలేక పోతున్నానని అన్నారు. ఎంతో భవిష్యత్ ఊహించుకుని.. కలలుకన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరమని పేర్కొన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు బలం కావాలి.. కానీ బలహీనత కాకూడదని వ్యాఖ్యానించారు. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని తనువు చాలించిందని చెప్పారు. ఈ విద్యార్థిని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. జీవితంలో సమస్యలు, కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడాలని విద్యార్థులు, యువతకు ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని విద్యార్థులను కోరారు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. చనిపోవడానికి ఉన్న ధైర్యం బతకడానికి ఎందుకు చూపించరంటూ విద్యార్థులను ప్రశ్నించారు. బతికి ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. ల్లూరి మన్యం జిల్లాలో రంపచోడవరంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శివాని 10వ తరగతి చదువుతోంది. జులై 24వ తేదీన రంపచోడవరంలో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శివాని.. తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకుంది. వచ్చే ఏడాది షైనింగ్ స్టార్ అవార్డు తీసుకుంటానని సీఎంకు ఆమె ధీమాగా చెప్పింది. దీంతో ఆ విద్యార్థిని పిలిచి.. సీఎం చంద్రబాబు తన పక్కన కూర్చొబెట్టుకున్నారు. శివాని మృతిపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఆమె మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. కుటుం బంలో కలహాల నేపథ్యంలో శివాని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది.

# పీహెచ్‌సీల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం

- సేవల సంఖ్య ఆధారిత ర్యాంకుల విధానానికి స్వస్తి
- మాతా శిశు ఆరోగ్యం నుంచి ప్రజల సంతృప్తి వరకు 21 అంశాల ఆధారంగా మార్కులు
- మాతృత్వ మరణాలు, సిజేరియన్లు తగ్గిన ఆసుపత్రులకు ర్యాంకింగ్ లో ప్రాధాన్యం
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




**అమరావతి, జులై 27 :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా... అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు. ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. 'సంజీవని', 'మాతృత్వ', 'క్షేమ' కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ... గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పీహెచ్‌సీల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని... వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది. ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ... గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేవలం సేవల సంఖ్యనే కాకుండా, వాటివల్ల ప్రజలకు కలిగిన ఆరోగ్య ప్రయోజనాలకు గుర్తింపునిస్తూ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించారు. సదరు పీహెచ్సీ ల పరిధిలో నమోదయ్యే టీనేజ్ గర్భధారణలు, హైరిస్క్ గర్భిణుల నమోదు, గర్భధారణ కాలంలో అందించే వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల శాతం, మొత్తం సంతానోత్పత్తి రేటు, మాతృ మరణాల నియంత్రణను పరిగణనలోకి తీసుకోనున్నారు. కొత్త ర్యాంకింగ్‌లో ఇవి అత్యంత కీలకం కానున్నాయి. శిశు మరణాలు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలు, ఏడాదిలోపు శిశువులకు పూర్తిస్థాయిలో టీకాలు, పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదలలో ఆలస్యాన్ని గుర్తించే పరీక్షలను కొత్త విధానంలో చేర్చారు. ఆరోగ్య సమస్యలున్న పిల్లలను గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడంతోనే అధికారుల బాధ్యత ముగియదు. వైద్యాధికారి సూచించిన పిల్లలకు వాస్తవంగా చికిత్స అందిందా? లేదా? అన్న అంశాన్నీ పరిశీలిస్తారు. దీనివల్ల పరీక్షల దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వీలవుతుంది. మధుమేహం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు కొత్త విధానంలో ప్రాధాన్యం ఇచ్చారు. అర్హులైన ప్రజల్లో రక్తపోటు మధుమేహం (ఆతిజీఎవబివబ), సాధారణ క్యాన్సర్ల పరీక్షలు ఎంతవరకు పూర్తయ్యాయి? వ్యాధి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా మందులు అందుతున్నాయా? వైద్య పరీక్షలు జరుగుతున్నాయా? అనే అంశాలను మదింపు చేస్తారు. క్యాన్సర్ అనుమానితులను గుర్తించి సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడాన్ని కూడా పనితీరు సూచికగా చేర్చారు. దీంతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశాలు పెరగనున్నాయి. పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవీఆర్ఎస్ (ఖీఉూ) ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రవర్తన, ఆసుపత్రి పరిశుభ్రత, వేచి ఉండే సమయం, మందుల లభ్యత, రోగులకు ఇచ్చే గౌరవం వంటి అంశాలు ర్యాంకింగ్‌ను నిర్ణయించడంలో కీలకం కానున్నాయి. మొత్తం 21 కీలక పనితీరు సూచికల్లో ఒక్కో అంశానికి గరిష్ఠంగా ఒక పాయింట్ కేటాయిస్తారు. సాధించిన మొత్తం స్కోరును శాతంగా మారుస్తారు. లక్ష్యాన్ని ఎక్కువగా సాధించాల్సిన అంశాల్లో మెరుగైన ఫలితాలకు అధిక స్కోరు ఇస్తారు. మాతృ మరణాలు, శిశు మరణాలు, టీనేజ్ గర్భధారణలు, సిజేరియన్ ప్రసవాల వంటివి తక్కువగా నమోదైన కేంద్రాలకు మెరుగైన స్కోరు లభిస్తుంది. 'ఏ' గ్రేడ్: 80% నుంచి 100% 'బి గ్రేడ్: 70% నుంచి 80% లోపు 'సీ' గ్రేడ్: 60% నుంచి 70% లోపు 'డి' గ్రేడ్: 60% కంటే తక్కువ "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించాం" అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఉ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.



## అఖిల్ వ్యక్తిగత జీవితంపై ట్రోలింగ్

### జైన్ కులం, మతంపై విమర్శలు.. పట్టించుకోని యువనటుడు

అక్కినేని హీరో అఖిల్ అక్కినేని తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన ట్రోలింగ్‌కు తొలిసారి ఘాటుగా స్పందించారు. గతేడాది తన ప్రేయసి జైనబ్‌ని వివాహం చేసుకున్న తర్వాత సోషల్ మీడియాలో ఆమె వయసు, మతంపై వచ్చిన విమర్శలను తాము ఏమాత్రం పట్టించుకోలేదని స్పష్టం చేశారు. ప్రేమ, పరస్పర అవగాహన, ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే తమ బంధానికి అసలైన బలమని చెప్పారు. 'లెనిన్' సినిమాతో కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న అఖిల్, ఓ తాజా పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సోషల్ మీడియాలో వచ్చిన నెగెటివ్ కామెంట్స్ గురించి అడగగా.. అలాంటి విషయాలకు తాము అసలు ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్ గురించి ఆలోచించాలా? లేక జీవితాంతం నాతో ఉండే వ్యక్తితో సంతోషంగా జీవించడం గురించి ఆలోచించాలా? నాకు రెండోది ముఖ్యమైంది. అందుకే ట్రోలింగ్‌ను ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదని అఖిల్ అన్నారు.పెళ్లికి ముందే తమ జీవితంలో ఇలాంటి విమర్శలు వస్తాయని జైనబ్‌కు చెప్పినట్లు అఖిల్ వెల్లడించారు.నేను నటుడిని. నా జీవితంలోకి వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో విమర్శలు తప్పవు. అందుకు సిద్ధంగా ఉండాలని నేను ముందుగానే చెప్పాను. ఆమె కూడా చాలా పరిణతితో అర్థం చేసుకుంది. వయసు, మతం గురించి వచ్చిన కామెంట్లను ఎంతో పాజిటివ్‌గా తీసుకుంది. అదే నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చింది అని తెలిపారు. తన కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన సమయంలో జైనబ్ తనకు అండగా నిలిచిందని అఖిల్ భావోద్వేగంగా చెప్పారు. ప్రేమలో కులం, మతం, వయసు కంటే పరస్పర అవగాహన, నమ్మకం ముఖ్యమని అఖిల్ అభిప్రాయపడ్డారు. పెళ్లికి ముందు ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవాలని యువతకు సూచించారు.





## సెప్టెంబర్‌లో మహేంవద్రగిరి వారాహి

సుమంత్ హీరోగా సంతోష్ జాగర్లమూడి ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'మహేంద్రగిరి వారాహి' సోషియో ఫాంటసీ చిత్రాన్ని సెప్టెంబర్ 11న విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. ఈ సినిమా కోసం రెండున్నరేళ్లు చర్చలు జరిగినట్లు సుమంత్ తెలిపారు. మధ్యలో ఈ సినిమా సందిగ్ధంలో పడిందని గుర్తుచేసుకున్నారు. ఇందులో ట్విస్ట్‌లు చాలా ఉన్నాయని తెలిపారు. ఓ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాలు కనిపిస్తారని నిర్మాత మధు వెల్లడించారు. కథ నచ్చడంతో వెంటనే ఓకే చేశారు. వారాహి అమ్మవారిగా నటించారా లేదా.. మరేదైనా పాత్రలో కనిపిస్తారా అనేది స్క్రీన్‌పై చూసి తెలుసుకోవాలి. సంతోష్‌కు ఆధ్యాత్మికత, చరిత్ర గురించి చాలా విషయాలు తెలుసు. మొదట అనుకున్న కథలో కొన్ని మార్పులు చేసి దీన్ని రూపొందించాం. ఇందులో నటించడం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది.


## ఆదర్శకుటుంబంలో చిట్టిబాబు గ్లింప్స్ విడుదల

టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటు న్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.




## త్వరలోనే రాకా షూటింగ్‌లోకి అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్,స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక పాన్-ఇండియా చిత్రం రాకా పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కొత్త షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిత్రబృందం త్వరలో ప్రారంభం కానున్న కొత్త షెడ్యూల్‌లో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సీన్ చిత్రీకరించ నుంది. ఈ ఎపిసోడ్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్‌ను నిర్మించినట్లు సమాచారం. అట్లీ మార్క్ స్టైలిష్ విజువల్స్, హై వోల్టేజ్ యాక్షన్‌తో బన్నీ ఎంట్రీ ప్రేక్షకులకు గూస్ బంప్స్ ఇచ్చేలా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ ఇప్పటివరకు కనిపించని వైల్డ్ అండ్ రగ్గడ్ లుక్లో కనిపించనున్నారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతు న్నాయి. ముఖ్యంగా ఇంట్రడక్షన్ సీన్‌లో ఆయన మేకోవర్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ స్టైల్ అభిమానులను ఆశ్చర్యపరి చేలా ఉంటాయని సమాచారం. 'పుష్ప' తర్వాత మరోసారి పూర్తిగా భిన్నమైన పాత్రలో బన్నీ కనిపించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'రాకా'లో హీరోయిన్‌గా బాలీవుడ్ స్టార్ దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ముగ్గురు స్టార్ హీరోయిన్లు ఒకే సినిమాలో భాగం కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'రాకా' కథ మాఫియా ప్రపంచం చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. ఓ శక్తివంతమైన డాన్ జీవితాన్ని కేంద్రంగా చేసుకుని యాక్షన్,




ఎమోషన్స్, థ్రిల్లింగ్ మలుపులతో కథ సాగనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అట్లీ తన గత చిత్రాల మాదిరిగానే కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భారీ విజువల్ ట్రీట్‌ను అందించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది.

## చేతబడిపై కామాక్షి భాస్కర్ల షాకింగ్ కామెంట్స్

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'అగధ'. నిర్మాతగా పలు సూపర్ హిట్స్ నిర్మించిన ఎంఎస్ రాజు దర్శకుడిగా రూపొందిచిన ఈ చిత్రంలో శ్రమన్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోనికా వనిత విజయ్ కుమార్, సిజ్జు రోషన్, శ్రేయరాణి రెడ్డి కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాను డివైన్ మిస్టిక్ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 14న థియేటర్స్ విడుదల చేయ-ంబోతున్నారు. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ జోరు పెంచిన మూవీ టీమ్ బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో బోనం సమర్పించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే, ఎంత బిజీగా ఉన్నప్పటికీ కామాక్షి భాస్కర్ల సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఫ్యాన్స్‌తో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆమెకు ఓ నెటిజన్ నుంచి విచిత్రమైన ప్రశ్న ఎదురైంది. మీపై ఎప్పుడైనా ఎవరైనా చేతబడి చేశారా అని సదరు నెటిజన్ అడిగారు. ఈ ప్రశ్నకు కామాక్షి ఎంతో సమయస్ఫూర్తితో సమాధానమిచ్చారు. సమాజంలో ప్రజలకు రకరకాల నమ్మకాలు ఉంటాయని, అయితే వాటిని తాను చూసే విధానం వేరని ఆమె తెలిపారు. జీవితం ఇప్పటికే ఎన్నో రహస్యాలతో నిండి ఉందని, అలాంటప్పుడు దానికి కాస్త హాస్యాన్ని జోడిస్తే తప్పేంటని ప్రశ్నించారు. కొన్నిసార్లు భయం అనిపించినప్పుడు ఎదురుగా చిన్న చిరునవ్వు చిందించి, మనస్ఫూర్తిగా నవ్వుకుంటూ ప్రతీ విషయాన్ని మరీ సీరియస్‌గా తీసుకోకుండా ఉండటమే మంచిదని చెప్పారు.

అంతేకాకుండా, ఒకవేళ ఎవరైనా తమ ఇంటి బయట చేతబడి కోసం నిమ్మకాయలు పెడితే.. వాటితో పాటు కాస్త పంచదార కూడా పెట్టడం మర్చిపోవద్దని ఆమె సరదాగాఅన్నారు. ఆ నిమ్మకాయలు, పంచదారతో చక్కగా జ్యూస్ చేసుకుని తాగేస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె ఇచ్చిన దిమ్మతిరికే ఆన్సర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.



## పొలిమేర-3 లో అర్జున్

టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లాస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



జనం వార్త

# బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీగా డేటా లీక్

బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీగా డేటా లీక్ అయినట్లు వచ్చిన వార్తలపై బ్యాంకు అధికారికంగా స్పందించింది. బ్యాంకులోని ఓ అధికారి ఇ-మెయిల్ ఖాతాను హ్యాక్ చేయడం ద్వారా హ్యాకర్లు కొంత డేటాను యాక్సెస్ చేశారని తెలిపింది. ఈ ఘటనను వెంటనే గుర్తించి.. తక్షణ నివారణ చర్యలు చేపట్టామని వెల్లడించింది. బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌లలోకి ఎవరూ ప్రవేశించలేదని..అవి సురక్షితంగానే ఉన్నాయని పేర్కొంది. ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడానికి సమగ్ర ఫోరెన్సిక్ దర్యాప్తు చేపట్టామంది. వినియోగదారుల డేటా భద్రతే తమకు అత్యంత ప్రధాన్యమని తెలిపింది.






# బిజినెస్




## వరుస నష్టాలకు బ్రేక్

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 27 :** వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం బలంగా పుంజుకున్నాయి. కొనుగోళ్లు ఊపందుకోవడంతో ప్రధాన సూచీలన్నీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 776.01 పాయింట్లు ఎగబాకింది. నిఫ్టీ 228.5 పాయింట్లు పెరిగి 24 వేల మార్కుకు చేరువైంది. ప్రపంచ మార్కెట్ ర్యాలీ సహా అమెరికా, ఇరాన్‌లు సైనిక దాడులను నిలిపివేస్తామనే నిర్ణయం నేపథ్యంలో ముడి చమురు ధరలు తగ్గడంతో భారత ఈక్విటీలు ఈ వారాన్ని బలంగా ప్రారంభించాయి. ఐటీ, మీడియా, రియాల్టీ, ఆటో, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ మీడియా సూచీ 2.50 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు.. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ మాత్రం స్వల్ప నష్టం(0.12శాతం)తో ముగిసింది. నిఫ్టీ సూచీలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు గరిష్ఠ లాభాలను నమోదు చేయగా.. ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు ఒత్తిడికి లోనై నష్టాలను చవిచూశాయి. అటు.. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి కూడా బలపడింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 68 పైసలు పెరిగి డాలర్‌కు ?95.89 వద్ద ముగిసింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి ?96.57 వద్ద ముగిసింది.



## కామన్వెల్త్ గేమ్స్..

### వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు మరో పతకం

**గ్లాస్గో:** కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకం సాధించింది. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 53 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తిన జ్ఞానేశ్వరి.. క్లీన్ అండ్ జెర్క్ 111 కేజీలు మోసి, మొత్తంగా 199 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది. ఒనోమే ఒమోలోలా (నైజీరియా) స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మొత్తం 206 కిలోల (స్నాచ్‌లో 93, క్లీన్ అండ్ జర్క్ 113 కిలోలు) బరువును ఎత్తి కామన్వెల్త్ క్రీడల రికార్డును నెలకొల్పింది. కాగా, రెబెకా గ్రౌల్డ్ (కెనడా, 178 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ ఫైనల్‌లో జ్ఞానేశ్వరి.. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ రెండింటిలోనూ ఒక్క ప్రయత్నం కూడా విఫలం కాకపోవడం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లోని భోండియా గ్రామానికి చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి యాదవ్ రాష్ట్ర పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె తండ్రి ఒకప్పుడు బాడీబిల్డర్. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కలలను వదులుకున్నారు. ఆయన ఇప్పుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. జ్ఞానేశ్వరి పతకం సాధించడంతో ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే మహిళల విభాగంలో మీరాబాయి చాను స్వర్ణం గెలవగా.. పురుషుల విభాగంలో రిషికాంత సింగ్, ముత్తుపాండి రాజా రజత పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్ ఇప్పటివరకు ఐదు పతకాలు సాధించింది.




## నేనేం చేయాలో ఒకరు చెప్పాల్సిన అవసరంలేదు

### సంజు శాంసన్

ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో సిరీసుల్లో ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడిన సంజు శాంసన్ కు జింబాబ్వే పర్యటనలో చోటు దక్కలేదు. ఒకవైపు అతడిని ఎందుకు తప్పించారనే ప్రశ్నలు తలెత్తగా.. మరోవైపు పక్కన పెట్టడం సరైందేనన్న వాదనా ఉంది. జింబాబ్వే పర్యటనలో వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. దీంతో ఓపెనింగ్ ప్లేస్ ఇప్పటికైతే ఖాళీగా లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సంజు శాంసన్ తన క్రికెట్ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తానేం చేయాలో ప్రత్యేకంగా ఎవరూ చెప్పనక్కర్లేదని వ్యాఖ్యానించాడు. "మన దేశంలో నిరంతరం పోటీ ఉంటుందని తెలుసు. అయితే, 2026 టీ20 ప్రపంచ కప్ ముందు ఇందులో నేను భాగం కాకూడదని నిర్ణయించుకున్నా. నా గేమ్‌ను ఆస్వాదించడంపైనే దృష్టి పెట్టా. దేవుడి దయ వల్ల నేను చాలా సాధించా. ఇప్పుడు నా వయసు 31ఏళ్లు. ఇంకా చాలా కాలం క్రికెట్ ఆడగలను. అందుకే, సొంత శైలిలోనే ఆడాలని అనుకుంటున్నా. ఎలా బ్యాటింగ్ చేయాలో నాకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సంజు ఎలా ఆడాలో సంజునే డిసైడ్ చేస్తాడు. 2024 వరల్డ్ కప్ తర్వాత 2026లో ఆడతానని అనుకోలేదు. కనీసం 15 మంది స్క్వాడ్‌లో కూడా ఉంటానని భావించలేదు. అయినా నాకు అవకాశం వచ్చింది. అనుకోకుండా వచ్చిన ఛాన్స్ అది. అందువల్ల నేను 2028 కోసం ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాను? నా అవసరం జట్టుకు ఉందని అనిపిస్తే ఎంపిక చేస్తారు. అప్పుడు మంచి ఇన్నింగ్స్‌లు ఆడేందుకు ప్రయత్నిస్తా" అని సంజు వెల్లడించాడు. "విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాడు. జట్టులోని ప్రతి ఒక్కరితోనూ ముక్కుసూటిగా ఉంటాడు. మీకు ఏదైనా అవసరమై అడిగితే.. దానికి సరైన పరిష్కారం చూపిస్తాడు. జిమ్‌లోనూ అంతే. అతడిలో చాలా ఫైర్ ఉంది. మేమిద్దరం జిమ్‌లోనూ వర్కౌట్లు చేసేవాళ్లం. ఆ సమయంలో నాకు వచ్చిన ప్రతి సందేహాన్ని తీర్చేవాడు. అంతర్జాతీయంగా మంచి క్రికెటర్ అవ్వాలనుకుంటే లైఫ్‌స్టైల్‌ను మార్చాలని సూచించాడు. తన ప్రయాణంలో ఏమేమి చేసేవాడో అన్నింటినీ చెప్పేవాడు. ఎవరైనా సరే కోహ్లీ చెప్పినట్లు ఓ పదేళ్లు చేస్తే భవిష్యత్తులో కెరీర్ గొప్పగా ఉంటుంది" అని సంజు తెలిపాడు.

# 'రోహిత్ శర్మకు జోడీగా సూర్యవంశీని ఓపెనర్‌గా పంపాలి'




టీనేజీ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇటీవల భారత జట్టు తరఫున టీ20ల్లోకి అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ 15 ఏళ్ల కుర్రాడిని వన్డేల్లో కూడా ఆడిస్తే బాగుంటుందని భారత మాజీ ఆటగాడు ఫారూక్ ఇంజనీర్ అభిప్రాయపడ్డారు. రోహిత్‌కు జోడీగా వైభవ్‌ను ఓపెనర్‌గా పంపించి శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు రావాలని సూచించారు. దీంతో మిడిల్ ఆర్డర్ బలంగా మారుతుందని ఫారూక్ ఇంజనీర్ అన్నారు. "గిల్ ఒక క్లాస్ ప్లేయర్. ప్రస్తుతం జట్టులో అతనే అత్యుత్తమ బ్యాటర్ అని నా అభిప్రాయం. అయితే, శుభ్‌మన్ ఆరంభంలోనే దూకుడుగా ఆడే రకం కాదు. వన్డేల్లో ఎడమ, కుడిచేతివాటం కాంబినేషన్ బాగుంటుంది. రోహిత్‌కు జోడీగా లెఫ్ట్ హ్యాండర్ అయిన వైభవ్‌ను పంపాలి. వైభవ్ దూకుడుగా ఆడుతుంటే మరో ఎండ్‌లో రోహిత్ ఎక్కువగా నాన్‌స్ట్రైకింగ్‌లో ఉండటానికి ప్రయత్నిస్తాడు. వైభవ్ ఉన్నంతసేపు రోహిత్ బ్యాట్‌కు పెద్దగా చెప్పాల్సిన అవసరం ఉండదు. కోహ్లీ మూడు, గిల్ నాలుగు స్థానాల్లో రావాలి. అప్పుడు బ్యాటింగ్ లైనప్ పటిష్ఠం అవుతుంది. సూర్యవంశీని వన్డే జట్టులోకి తీసుకోవడానికి ఇదే సరైన సమయం అనిపిస్తోంది. అతను నిలకడగా పరుగులు సాధిస్తు న్నాడు. అతను అద్భుతమైన ఆరంభాన్ని అందించినప్పుడు ఇతర ఆటగాళ్లకు ఇన్నింగ్స్‌ను నిలకడగా ముందుకు తీసుకెళ్లి భారీ స్కోరు సాధించే అవకాశం లభిస్తుంది. నా దృష్టిలో వీవ్ రిచర్డ్స్ గొప్ప బ్యాటర్. అతడిలాంటి బెస్ట్ బ్యాటర్‌ను చూడలేదు. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ కూడా అలానే కనిపిస్తున్నాడు. రానున్న కాలంలో కచ్చితంగా టీమ్‌ఇండియాకు ఆశాకిరణంగా మారనున్నాడు" అని ఫారూక్ పేర్కొన్నారు.

# థాంక్యూ వీవీఎస్ సర్.. స్ఫూర్తి నింపారు

### శ్రేయస్ అయ్యర్

వరుసగా రెండు సిరీస్‌లను కోల్పోయిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు భారీ ఊరట లభించింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో ఎట్టకేలకు సిరీస్ విజయం అందుకొన్నాడు. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ చేతిలో సిరీస్‌లను కోల్పోయిన సంగతి తెలిసిందే. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తోపాటు సంజు శాంసన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా అందుబాటులో లేరు. అయినా కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వీవీఎస్ లక్ష్మణ్ మార్గదర్శకంలో శ్రేయస్ సేన అదరగొట్టింది. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కు అయ్యర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. "నిజాయతీగా మాట్లాడుకోవాలంటే.. ఈ సిరీస్‌లో వదిలేసిన క్యాచ్‌లు మినహా, మేం ఎటువంటి లోపాలు లేకుండా ఆడామ నేది నా అభిప్రాయం. జట్టులోని ప్రతి ఒక్కరూ.. సహాయక సిబ్బందితో కలిపి అద్భుతంగా శ్రమించారు. ఈ సందర్భంగా వీవీఎస్ సర్‌కు ధన్యవాదాలు. మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తూ స్ఫూర్తి నింపారు. మైదానంలోకి దిగిన ప్రతి రోజూ మీరు చెప్పిన మాట సరైందని అనిపించేది. పరిస్థితులకు తగ్గటుగా ఆడామ నడంలో ఎలాంటి సందేహం లేదు" అని శ్రేయస్ తెలిపాడు.




#### యువకులతో కూడిన జట్టు: లక్ష్మణ్

"శ్రేయస్ అయ్యర్‌కు శుభాకాంక్షలు చెబుతున్నా. అతడి నాయకత్వ ప్రయాణం టఫ్‌గా ప్రారంభమైంది. కానీ, కమ్‌బ్యాక్ మాత్రం సూపర్. జింబాబ్వేతో మొదటి మ్యాచ్‌కు ముందు రోజు మాతో చేరిన శ్రేయస్.. తప్పకుండా సిరీస్‌ను గెలుస్తామనే ఆశాభావంతో ఉన్నాడు. ఇప్పుడు అతడి నాయకత్వంలో సాధించాడు. ఈ జట్టులో చాలా మంది యువకులే. ఓ నలుగురైదుగురు మాత్రమే ఇంగ్లాండ్ సిరీస్ నుంచి కొనసాగుతున్నారు. అయితే, ఈ సిరీస్ విజయానికి క్రెడిట్ మాత్రం శ్రేయస్‌కే ఇవ్వాలి. సహచరులకు అతడు ఇచ్చిన ప్రోత్సాహం అద్భుతం" అని వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసించాడు.

## వైభవ్ సత్తాను విజయవాడలోనే గుర్తించాం: వీవీఎస్ లక్ష్మణ్

"ఎప్పుడూ దూకుడుగా ఆడటమే వైభవ్ చేసే పని. కానీ, ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా స్పందించిన తీరు అద్భు తం. పరిణతి చూపించాడు. మ్యాచ్ మ్యాచ్‌కూ అనుభవం వస్తుంది. పరిస్థితులను అంచనా వేయడం, అర్థం చేసుకో వడంలో అతడు మెరుగ్గా మారుతున్నాడు. ప్రతి ప్రాక్టీస్ సెషన్ సమయంలో అతడు సమీక్షించుకుంటున్నాడు. మూ డో టీ20 ఆడిన పిచ్ మందకొడిగా ఉంది. ఇక్కడ పరుగులు రాబట్టడం కష్టమే. జింబాబ్వే బౌలర్లు చాలా చక్కగా బౌలింగ్ చేశారు. కానీ, వైభవ్ మాత్రం ఎక్కడా తొందరపడలేదు" అని లక్ష్మణ్ తెలిపాడు. "వైభవ్ దూకుడును ఇప్పుడు చూస్తు న్నాం. కానీ, రెండున్నరేళ్ల కిందట మేం తొలిసారి అతడిని గమనించాం. 2024 అండర్ -19 వరల్డ్ కప్ ముందు అతడి ఆటను చూశాం. విజయవాడలో జరిగిన క్వాడ్రపుల్ సిరీస్‌లో ఇండియా బి తరఫున వైభవ్ టాప్ స్కోరర్. అప్పటి కి.. ఇప్పటికీ అదే శైలిలో ఆడుతున్నాడు. ఇప్పుడీ సిరీస్‌లో మాత్రం పరిస్థితులకు తగ్గట్టుగా మారిపోయాడు" అని లక్ష్మణ్ వెల్లడించాడు. "వైభవ్‌లో ఒకే ఒక్క మార్పు మాత్రమే రావా లని కోరుకుంటా. అది అతడి ఆటపరంగా కాదు. ఫిట్‌నెస్ పై దృష్టి పెట్టాలి. అతడు ఇంకా చిన్నపిల్లాడే. తన ఆటను మరింత మెరుగుపర్చుకోవాలని భావిస్తాడు. కానీ, జట్టుపరం గా మేం అతడి ఫిట్‌నెస్‌పైనా దృష్టిపెట్టాలి. మూడో టీ20 సమయంలో క్యాచ్ పట్టేందుకు ప్రయత్నిస్తూ గాయపడ్డాడు. కానీ, మైదానం వదిలి రావడానికి మాత్రం ఆసక్తి చూపిం చలేదు. ఫిజియో వచ్చి చెప్పినా స్టేడియంలోనే ఉంటానని వైభవ్ అన్నాడు. ఆటపట్ల అతడికి ఉన్న అభిరుచి అలాంటిది. తన వల్ల జట్టుకు ఎలాంటి ప్రయోజనం ఉన్నా వదిలిపెట్టడు. రాబోయే కాలంలో మరింత ఫిట్‌గా ఉండాల్సిన అవసరం ఉంది" అని వీవీఎస్ వివరించాడు.




## ఆగస్టులో రూ.25,000 కోట్ల ఐపీఓలు

ప్రాథమిక మార్కెట్‌లో ఐపీఓల సందడి పెరుగుతోంది. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకులతో, ఈ ఏడాది తొలి అర్థభాగంలో ఆచితూచి అడుగేసిన కంపెనీలు.. ఇప్పుడు తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు ఆసక్తి చూపుతున్నాయి. ఆగస్టులో డజనుకు పైగా కంపెనీలు ఐపీఓలకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, నిత్యావసరాలు డెలివరీ చేసే జెప్టోతో పాటు ట్రూహోమ్ ఫైనాన్స్, లాజిస్టిక్స్ సంస్థ షిప్‌రాకెట్ వంటి కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ కలిపి రూ. 25,000 కోట్లకు పైగా నిధులు సమీకరించనున్నాయి. వచ్చే నెలలో రాబోయే అతి పెద్ద ఐపీఓల్లో జెప్టో ఒకటి. తాజా షేర్ల జారీ ద్వారా రూ. 8,010 కోట్లు సమీకరించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో మరో 11.34 కోట్ల ఈక్విటీ షేర్లను సంస్థ విక్రయించనుంది. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ట్రూహోమ్ ఐపీఓ ద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. ఇందులో తాజా షేర్ల జారీ ద్వారా రూ. 1,500 కోట్లు, ఓఎఫ్ఎస్‌లో రూ. 1,500 కోట్లు సమీకరించనుంది. ఎలివేట్ క్యాంపసెస్ తాజా షేర్ల జారీ ద్వారా రూ. 2,550 కోట్లు; షిప్‌రాకెట్ తాజా షేర్ల జారీ-ఓఎఫ్ఎస్ కలిపి రూ. 2,342.35 కోట్లు, ఇన్నోవేటివ్ వ్యూ ఇండియా పూర్తిగా ఓఎఫ్ఎస్ ద్వారా రూ. 2,000 కోట్ల చొప్పున నిధులు సమీకరించనున్నాయి. మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ కూడా వచ్చే నెలలోనే రూ. 1,553 కోట్ల ఐపీఓకు రానుంది. ఇది కూడా పూర్తి ఓఎఫ్ఎస్ విధానంలోనే నిధులు సమీకరించనుంది. ఇవే కాకుండా ధూత్ ట్రాన్స్‌మిషన్, ఏఆర్‌సీసమీకరించనున్నాయి. ఏఆర్‌సీఐఎల్ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్), అర్థీ ఇండస్ట్రీస్, గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, రేస్ ఆఫ్ బిలీఫ్, హై-టెక్ ఇంజినీర్స్, శంకేష్ జువెలర్స్, లెర్న్‌ఫ్లూయెన్స్ ఎడ్యుకేషన్స్ సంస్థలు కూడా ఆగస్టులో ఐపీఓ ద్వారా నిధులు సమీకరించే యత్నాల్లో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 36 కంపెనీలు ఐపీఓలకు వచ్చాయి. ఇందులో ఈ నెలలోనే 9 నమోదయ్యాయి. మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్, జునిపర్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూలు ఈ నెల 29, 30 తేదీల్లో ప్రారంభం కానున్నాయి. ఈ వారంలోనే ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ కూడా ఐపీఓకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.



## క్రిప్టో ఆస్తులపై సీబీడీటీ మార్గదర్శకాలు

క్రిప్టో ఆస్తుల వెల్లడిపై కొత్త మార్గదర్శకాలను ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం జారీ చేసింది. క్రిప్టో ఎక్స్ఛేంజీలు లావాదేవీల వివరాలు వెల్లడించడం (డిస్‌క్లోజర్)లో ఇవి మరింత పారదర్శకత తెస్తాయని భావిస్తున్నారు. క్రిప్టో ఇన్వెస్టర్లు కూడా తాము వెల్లడించే వివరాలు.. క్రిప్టో ఎక్స్ఛేంజీల రిపోర్టింగ్‌కు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ప్రకారం, 2025 ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 509, 2026 ఆదాయపు పన్ను నిబంధనల్లో 241 నుంచి 244, ఫారం 167 కింద రిపోర్టింగ్ బాధ్యతలను అమలు చేయడంలో రిపోర్టింగ్ క్రిప్టో-అసెట్ సర్వీస్ ప్రొవైడర్ల (ఆర్‌సీఏఎస్‌పీల)కు మార్గదర్శకత్వం వహించడమే ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. లావాదేవీల చట్టబద్ధత, నియంత్రణలపై స్పష్టత: క్రిప్టో లావాదేవీలను ధ్రువీకరించడానికి, భద్రపరచడానికి.. క్రిప్టోగ్రాఫికల్ విధానంలో భద్రపరిచిన డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్, అటువంటి సాంకేతికతలపై ఆధారపడే విలువల డిజిటల్ రూపంగా క్రిప్టో ఆస్తులను నిర్వచించారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలు, నిర్దిష్ట ఎలక్ట్రానిక్ మనీ ఉత్పత్తులు, చెల్లింపులు, పెట్టుబడుల ప్రయోజనాల కోసం ఉపయోగించలేమని ఆర్‌సీఏఎస్‌పీ నిర్ధారించిన క్రిప్టో ఆస్తులు మినహా అన్నింటికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి.